ఇంటి ముంగిటకే పథకాల లబ్ధి


జల్లికాకినాడలో గడపగడపకు మన ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: ప్రభుత్వ పథకాల లబ్ధి అర్హుల ఇళ్ల వద్దకే చేరుతుందని, అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు అన్నారు. శుక్రవారం గణపవరం మండలం జల్లికాకినాడలో నిర్వహించిన 130వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగి మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన పథకాలు వివరించారు. నవరత్నాల పథకాల ద్వారా ముఖ్యమంత్రి జగన్ ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకుని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇన్ని సంక్షేమ పథకాలను ఏకకాలంలో అమలు చేసిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని తెలిపారు. పథకాల అమలులో అర్హతే ప్రామాణికమని, ఎవరికైనా అర్హత ఉండి పథకాలు అందకపోతే వెంటనే వారికి ఆయా పథకాలు మంజూరు చేయడం జగన్ పాలనలోనే జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. తమకు ఇళ్లస్థలాలు ఇవ్వాలంటూ కొందరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారందరికి ఇళ్లస్థలాలు ఇచ్చామని, అర్హులుంటే రెండో విడత స్థలాలిస్తామని హామీ ఇచ్చారు. కొందరు రోడ్లు, మంచినీరు, డ్రైనేజి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈసందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో పరిపాలన వికేంద్రీకరణ ద్వారా ప్రజల ముంగిటకే పాలన తీసుకువచ్చి ప్రజలు గ్రామం దాటి మండల, జిల్లా, రాష్ట్ర కేంద్రాలకు వెళ్లే అవకాశం లేకుండా చేశామని అన్నారు. మనబడి, నాడు-నేడు కార్యక్రమం ద్వారా పేదల పిల్లలకు కార్పొరేటు సదుపాయాలతో విద్యను అందిస్తున్నామని, అమ్మఒడి, విద్యాకానుక, విద్యాదీవెన తదితర పథకాలను ఉపయోగించుకుని మీపిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని తల్లిదండ్రులకు సూచించారు. జగన్ లక్ష్యంగా పచ్చమీడియా, ప్రతిపక్షాలు చేస్తున్న అసత్యప్రచారాన్ని గుర్తించి మీరంతా జగనన్నకు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అర్ధవరం రాము, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు రాము, సర్పంచ్ బాతు నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు దిలీప్‌వర్మ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఇందుకూరి రామ కృష్ణంరాజు, పార్టీ నాయకులు సోడదాసి జైపాల్, బుజ్జి రాజు, దావీదు, నరేష్, కాకర శ్యాం, బుద్దారపు పుల్లయ్య, అప్పనపేట ఎంపీటీసీ సర్పంచ్‌లు సత్యనారాయణ, నక్కా సూరిబంగారయ్య, సొసైటీ అధ్యక్షుడు కె.శ్రీనివాసరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటికి అధిక ప్రాధాన్యత

గణపవరం: ఉంగుటూరు నియోజకవర్గంలో తాగు నీటి సమస్య పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు అన్నారు. శుక్రవారం గణపవరంలో మంచి నటి చెరువు సువర్ణగుండం అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజచేసి, పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వాసాగు విస్తారంగా ఉన్న గణపవరం నిడమర్రు మండలాల్లో మంచినీటి వనరులు కాలుష్యం బారిన పడుతున్నాయని అందువల్ల ప్రతి గ్రామంలో మైక్రోఫిల్టర్ యూనిట్లు, ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. వాటర్‌గ్రిడ్ పథకం ద్వారా సుమారు 3వేల కోట్ల రూపాయలతో జిల్లాలో అన్ని గ్రామాలకు ముఖ్యంగా కొల్లేరు, డెల్టా గ్రామాలకు గోదావరి జలాలను ప్రత్యేక పైపులైను ద్వారా అందించే పథకం త్వరలో సాకారం కానుందన్నారు. బువ్వనపల్లి మంచి నీటి చెరువు తవ్వకం పనులు చివరిదశలో ఉన్నాయన్నారు. జలజీవన్ మిషన్ పథకంలో రెండో విడతగా గణపవరం మండలానికి రూ.2.58 కోట్లు మంజూరయ్యాయని, వీటితో శివారు ప్రాంతాలకు ప్రత్యేక పైపులైన్లు, పాతపైపులైన్లు తొలగించి కొత్తలైన్లు వేయడం, వాటర్ ట్యాంకులు, ఫిల్టర్స్ నిర్మాణం వంటిపనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో గణపవరం సర్పంచ్ మూర అలంకారం, ఎంపీపీ అర్ధవరం రాము, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దండు రాము, వైఎస్సార్‌సీపీ నాయకులు కాకర్ల శ్రీను, మాదేటి సురేష్, శెట్టి రాజా, తోటశ్రీను, రొంగల శ్రీను, కొండేటి వెంకటరత్నం, దేవస్థానం ఛైర్మన్‌లు వంకాయల రామారావు,కె.రామకృష్ణంరాజు, ఎంపీడీవో జ్యోతిర్మయి, ఆర్‌డబ్ల్యుఎస్ఏఈ హరనాథ్‌రాజు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత


వైఎస్సార్ బీమా నగదును అందచేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: చేబ్రోలు గ్రామంలో వైఎస్సార్ బీమా 10వేల రూపాయల నగదును ఓ కుటుంబానికి అందజేశారు. చేబ్రోలు సచివాలయం 2 పరిధిలోని భువనగిరి జయగీత ఇటీవల మరణించారు. వైఎస్సార్ బీమా రూ.10వేలు మంజూరు అయ్యింది. ఆ నగదును సచివాలయ 2 వైసీపీ కన్వీనర్ లోవరాజు, వెల్ఫేర్ సహాయకురాలు మాధురి సమక్షంలో జయగీత కుమార్తెకు శుక్రవారం నగదును అందచేశారు.

నేడు జల్లికాకినాడలో గడపగడపకు మన ప్రభుత్వం

గణపవరం: గణపవరం మండలం జల్లికాకినాడ గ్రామంలో ఈనెల 4వతేదీ శనివారం సాయంత్రం 4 గంటలకు 131వ రోజుగడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఈకార్యక్రమంలో పాల్గొని గత మూడున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తారని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దండు రాము తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పక ఈకార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

కష్టపడి పనిచేస్తే.. ఎక్కువ వేతనం


మస్టర్‌లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజ్‌మనోజ్

పెదవేగి : కరువు పనుల్లో కష్టపడి పనిచేసే వారికి ఎక్కువ వేతనం పొందే అవకాశం ఉందని పెదవేగి ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ అన్నారు. శుక్రవారం ఆయన గార్లమడుగు పంచాయతీ సూర్యారావు పేట చెరువులో జరుగుతున్న కరువు పనులను పరిశీలించారు. పని చేస్తున్న కూలీలకు ఫీల్డ్ అసిస్టెంట్ వేసిన మస్టర్‌లను ఎంపీడీఓ క్షుణ్ణంగా పరిశీలించారు. పని ప్రదేశంలో తాగునీరు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రథమ చికిత్సకు అవసరమయ్యే మందులను అందుబాటులో ఉంచాలని టిఏని ఫీల్డ్ అసిస్టెంట్‌ని ఆదేశించారు.

సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలి


పోతునూరు ఆర్‌బీకెలో ఈ క్రాఫ్ హాజరును తనిఖీ చేస్తున్న తహసీల్దార్ నాంచారయ్య

దెందులూరు: రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాల సాధనలో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది వ్యవసాయ శాఖ ఉద్యోగులు సమన్వయంతో విధులు నిర్వహించాలని దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య అన్నారు. శుక్రవారం పోతునూరు రైతు భరోసా కేంద్రంలో ఈ క్రాఫ్ హాజరును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు భరోసా కేంద్రాలకు వచ్చే రైతులకు జవాబుదారీగా సిబ్బంది సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో బోదుల శ్రీనివాసరావు, ఆర్‌బీకె సిబ్బంది ఉన్నారు.

సానెగూడెంలో వైఎస్సార్ పొలంబడి


పొలంబడిలో రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

దెందులూరు: వరి పంటలో వచ్చే పురుగులు, తెగుళ్ల నివారణకు వాడే మందులు మోతాదును రైతులంతా వ్యవసాయ శాఖ సిబ్బంది, సలహాల, సూచనలతో వాడాలని దెందులూరు ఏవో గద్దె రమేష్ అన్నారు. గురువారం సానెగూడెం గ్రామంలో గ్రామ సర్పంచ్ సనిపల్లి రామకృష్ణ విష్ణు, ఉద్యానవన సహాయకులు చింతా చాణక్య వర్మ ఆధ్వర్యంలో వైఎస్సార్ పొలంబడి జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు కూరంశెట్టి ధనుంజయరావు, అక్కినేని హనుమోజీరావు, సత్యనారాయణ, కూనేరావు, శ్రీనివాసరావులు సాగుకు సంబంధించి వివరాలను ఏవోను అడిగి తెలుసుకున్నారు.

ట్రాక్ మరమ్మతులు పూర్తి


భీమడోలు రైల్వే గేటు మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

భీమడోలు: భీమడోలు రైల్వే ట్రాక్ అత్యవసర పనులు పూర్తి కావడంతో శుక్రవారం రాత్రి నుంచి వాహనాల రాకపోకలు పునః ప్రారంభమయ్యాయి. ట్రాక్ రిపేరు పూర్తి కావడంతో రైల్వే అధికారులు గత నెల 30వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు రైల్వే గేటు మూసివేసి ట్రాక్ మరమ్మతు పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తి కావడంతో రైల్వే గేటును తెరిచారు. దీనితో జిల్లా నలుమూలల నుంచి వచ్చే వాహనాలు ఈ ట్రాక్‌పై రాకపోకలు సాగిస్తున్నాయి. ఐదు రోజులు పాటు ఇబ్బందులు పడిన రైతులు, విద్యార్థులు, ద్విచక్ర, భారీ వాహనదారులకు ఉపశమనం కలిగింది.

కూలీలకు వసతుల కల్పనపై శ్రద్ధ వహించండి


ఉపాధి హామీ పథక ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పెదవేగి : జాతీయ ఉపాధి హామీ పథకంలో సిబ్బంది మ్యాన్‌డేట్స్ పెంచడం కూలీలకు కల్పించాల్సిన వసతులపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని పెదవేగి ఎంపీడీవో రాజ్ మనోజ్ అన్నారు. మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై పీల్డ్ అసిస్టెంటలతో, టెక్నీకల్ అసిస్టెంటలతో ఎంపీడీఓ రాజ్ మనోజ్ శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కూలీలకు కల్పించే పనిదినాల కల్పనపై, ఉపాధి పనుల్లో నిర్వహించాల్సిన 7 రకాల రికార్డ్‌ల పై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి


జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి

భీమడోలు: రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 5న నిర్వహించనున్న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి అన్నారు. భీమడోలు జంక్షన్‌లో శుక్రవారం ఓ కల్యాణ మండపంలో జిల్లా స్థాయి విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నరసింహా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలోని పలు రైతాంగ సమస్యలు చర్చించి తీర్మానాలు చేసారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్లే రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని, వ్యవసాయ నష్టాలతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. రైతుల పంటలకు కనీస మద్దతు ధరలు రావడం లేదన్నారు. గ్రామ స్థాయి నుంచి సంఘాన్ని బలోపేతం చేసేందుకు ఈ సమావేశాలు దోహద పడతాయన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు , చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతులకు 2013 భూసేకరణ చట్టం న్యాయమైన పరిహారాన్ని అందించాలన్నారు. పొలకు గిట్టుబాట ధరను కల్పించాలని, టన్నుల గెలలకు రూ.20వేలు ఇవ్వాలని, తామర పురుగుతో నష్టపోయిన మిర్చి రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. రైతాంగ సమస్యలపై ఏప్రిల్ 5వ తేదీన ఛలో ఢిల్లీ నిర్వహిస్తున్నామన్నారు. మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తేవాలని రైతులు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా నాయకులు జి.ప్రసాదరావు, కట్టా భాస్కరరావు, కె.జలపాలు, బొడ్డు రాంబాబు, సిరిబత్తుల సీతారామయ్య, గండి రాజా, గుండపనేని సురేష్, సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కె.అప్పారావు, జిల్లా కో కన్వీనర్ వి.శ్రీరామచంద్రమూర్తి, రైతులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన


భీమడోలు జంక్షన్‌లో వ్యవసాయ బడ్జెట్ ప్రతులను దగ్ధం చేస్తున్న రైతు సంఘం నాయకులు

భీమడోలు: కార్పొరేట్ కంపెనీలకు వరాలు, వ్యవసాయ రంగానికి నిధుల కోత పెట్టిన కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో భీమడోలు జంక్షన్‌లో రైతులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. భీమడోలు జంక్షన్‌లో నిరసన ప్రదర్శన చేసారు. ఈ సందర్భంగా రాష్ట ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి భారీగా నిధులు కోత పెట్టారని విమర్శించారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమ ఫలితంగా రైతాంగానికి ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుకు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదనలు లేకపోవడం దుర్మార్గమన్నారు. 2022 నాటికి పీఎం మోడీ ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని హామీ ఇచ్చి రైతుల పంటల ఖర్చులు రెట్టింపు చేసారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి 10శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నరసింహా, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, నాయకులు బి.రాంబాబు, ఎస్.సీతారామయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కె.జలపాలు, జి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్చమ్మ తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు


అమ్మవారికి పూజలు చేస్తున్న దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య


గాలాయిగూడెం అచ్చమ్మ పేరంటాల తల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

దెందులూరు:మండలంలోని గాలాయిగూడెంలోని అచ్చమ్మ పేరంటాలు ఉత్సవాలకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. అనేక జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆలయ ప్రదక్షిణలు నిర్వహించి మొక్కులు తీర్చుకుని పూజలు చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన చిన్నారులు కోలాటం నిర్వహించారు. ఉత్సవాల్లో అమ్మవారి గాజులను భక్తులు అధిక సంఖ్యలో కొనుగోలు చేశారు. దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, వీఆర్‌వో విష్ణు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్థిక సాయం అందజేత

దెందులూరు: పోతునూరు గ్రామంలో పసర కోనేరు చెరువు వద్ద అగ్నిప్రమాద బాధితురాలు శాతం పద్మావతికి శుక్రవారం పోతూనూరు గ్రామ సర్పంచ్ బోదుల స్వరూప్ నగదు, సరుకులు అందజేశారు. ప్రమాదవశాత్తు పద్మావతి ఇళ్లు అగ్నిప్రమాదానికి గురైంది. ప్రభుత్వం నుంచి వచ్చే సహాయాన్ని త్వరితగతిన మంజూరు అయ్యేలా ఎమ్మెల్యే కొఠారు అబ్బాయ్య చౌదరికి చెప్పి కృషి చేస్తామన్నారు. ఆపదలో ఉన్న వారిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.

అక్రమ నిర్బంధం అన్యాయం

ఉంగుటూరు: ఉపాధ్యాయులను అక్రమ నిర్బంధం చేయడం అన్యాయమని పలువరు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. సీపీఎస్ రద్దుకోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో గన్నవరం సంకల్ప దీక్షకు వెళ్తున్న ఉపాధ్యాయులను నిలుపుదల చేయడం అన్యాయయమని పేర్కొన్నారు. ఉంగుటూరు మండల యుటిఎఫ్ నాయకులును గన్నవరంలో అరస్టు చేయడాన్ని వారు ఖండించారు.

ఇద్దరు వలంటీర్ల సేవా దృక్పథం


విజయవాడ వెళ్లి వృద్ధుడు ముచ్చు వెంకయ్యకు ఫించన్ అందిస్తున్న వలంటీర్ వెంకటేశ్వరరావు


గుంటూరు ఆసుపత్రికి వెళ్లి రోగి మల్లెం వెంకట రామారావుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ గురుజల్లా వీర్రాజు

భీమడోలు: దుద్దేపూడి, పూళ్ల సచివాలయాల గ్రామ వలంటీర్లు తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పింఛన్‌దార్ల వద్దకు వెళ్లి వైఎస్సార్ పింఛన్ కానుక నగదు అందించి తమ సేవాగుణాన్ని చాటారు. దుద్దేపూడి సచివాలయం పరిధిలోని అన్నేవారిగూడెం గ్రామానికి చెందిన ముచ్చు వెంకయ్య భార్య విజయవాడ ఆసుపత్రిలో ఆనారోగ్యంతో చికిత్స పొందుతుంది. ఈ నేపథ్యంలో తన భార్యకు సపర్యలు చేసేందుకు ముచ్చు వెంకయ్య ఆసుపత్రిలోనే ఉంటున్నాడు. అన్నేవారిగూడెం వచ్చి పింఛన్ పొందేందుకు వీలు లేకపోవడంతో అన్నేవారిగూడెం వలంటీర్ కుక్కల వెంకటేశ్వరరావు విజయవాడ వెళ్లి బయామెట్రిక్ తీసుకుని రూ.2750లు పింఛన్ సొమ్ము అందించడంతో ఆ వృద్ధుడు జగనన్న ప్రభుత్వాన్ని , వలంటీర్ కుక్కల వెంకటేశ్వరరావును అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా పూళ్ల సచివాలయం 3 పరిధిలోని ఎంఎంపురంకు చెందిన మల్లెం వెంకట రామారావు ఆనారోగ్యంతో బాధపడుతూ గుంటూరు ఆసుపత్రిలో 15 రోజులుగా చికిత్స పొందుతున్నాడు. పింఛన్ ఈనెలకు పోతుందని తెలిసిన వలంటీర్ గురుజల్లా వీర్రాజు 300 కిలోమీటర్ల దూరం ప్రయాణించి గుంటూరు వెళ్లి రూ.2750లు పింఛన్ సొమ్మును అందించి సేవా దృక్పధాన్ని చాటాడు. ఆ ఇద్దరు వలంటీర్లను ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

అడవికొలను ఉప సర్పంచ్‌గా వీరవేణి


ఏకగ్రీవంగా ఎన్నికైన ఉప సర్పంచ్ వీరవేణి దంపతులను అభినందిస్తున్న వైసీపీ నేతలు

నిడమర్రు: అడవికొలను ఉప సర్పంచ్‌గా గుండుమోలు వీర వేణి (చిన్నా) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి , ఈవోపీఆర్డీ చంద్రశేఖరం ప్రకటించారు. ఇప్పటి వరకూ అడవికొలను పంచాయతీ ఉపసర్పంచ్‌గా ఉన్న పాపోలు వెంకట సత్యవతి రాజీనామా చేయడంతో శుక్రవారం పంచాయతీ బోర్డు సభ్యులతో అధికారుల సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వైసీపీ నేత వీర వేణిని బోర్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఉపసర్పంచ్‌గా వైసీపీ నుంచి ముగ్గురు పోటీ పడటంతో పోటీ పడిన ముగ్గురికి బోర్డు అవకాశం ఇవ్వాలని నిర్ణయంలో భాగంగా తొలి 18 నెలలు పాపోలు వెంకట సత్యవతికి, తర్వాత రెండేళ్లు గుండుమోలు వీరవేణికి, మిగిలిన కాలం పంచాయతీ మెంబరుగా ఉన్న మరియమ్మకు అవకాశం కల్పించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా నూతన ఉప సర్పంచ్‌గా ఉన్న వీర వేణి మాట్లాడుతూ అడవికొలను గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు పాపోలు వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ మజ్జి శ్రీను, నీటి సంఘం అధ్యక్షుడు పాపోలు రంగారావు, దేవస్థానం ఛైర్మన్ నిమ్మల సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీపీ కొండా సంగయ్య, వైసీపీ నేతలు నిమ్మల బుజ్జి, నిమ్మల రమేష్, మానికల సత్యనారాయణ, బైరబోయిన రవి, రాజు తదితరులున్నారు.

అన్ని గ్రామాల్లో మొక్కలు నాటాలి


ప్రజావేదికలో అభ్యంతరాలను సమీక్షిస్తున్న డ్వామా పీడీ డీ రాంబాబు

పెదపాడు : మండలంలోని ఉపాధిహామీ పథకంలో అన్ని గ్రామాల్లో మొక్కలు నాటాలని లేకుండా రికవరీ వ్రాయనున్నట్లు డ్వామా పీడీ డీ రాంబాబు తెలిపారు. పెదపాడు మండలంలోని 2020-21, 2021-22 ఆర్థిక సంవ్సరాలకు గాను సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో వ్యక్తమైన నిర్వహించిన పనులు, వాటి అభ్యంతరాలపై గ్రామాల వారీగా సమీక్షించారు. మండలంలో ఉపాధిహామీ పథకంలో 1669 పనులకు గాను రూ 23కోట్లు విలువైన పనులు నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖలో 74 పనులుకు గాను రూ3.10లక్షలు, సర్వశిక్ష అభియాన్ పథకంలో 15 పనులకుగాను రూ.15.50 లక్షలు ఆర్‌డబ్ల్యుఎస్ విభాగంలో 4 పనులకు గాను 12లక్షలు పారెస్టు విభాగంలో రూ.12లక్షలు విలవైన పనులు నిర్వహించామన్నారు. ఈపనులకు సంబంధించి అన్ని గ్రామాల్లో సామాజిక తనిఖీ దారులు తనికీలు చేపట్టారని వాటిలో కొన్ని గ్రామా ల్లో వేలిముద్రలు, సంతకాలు లేకుండా వారికి పేమెంట్స్ చేయడం జరిగిందన్నారు. పెదపాడు ఎంపీపీ బత్తుల నిర్మలకుమారి, ఎస్ఆర్‌పీ దాసు, ఎంపీడీవో ఎస్‌నిర్మలజ్యోతి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు పాల్గొన్నారు.

కాలానికి అనుగుణంగా పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

పెదపాడు : కాలానికి అనుగుణంగా పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని నిట్ వరంగల్ డైరెక్టర్ రమణ అన్నారు. స్థానిక రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఫలితాల ఆధారిత విద్య అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఇంజనీరింగ్‌లో ఫలితాల ఆధారిత విద్య (అవుట్ కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్)బోధనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఫలితాల ఆధారిత విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పాఠశాలలను అనువర్తనాలతో ఉదాహరణలతో బోధించాలన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మురళీధరరావు ఉన్నారు.

రబీలో 2.10లక్షల ఎకరాల్లో వరి నాట్లు పూర్తి


పొలంబడి కార్యక్రమంలో రైతులకు పలు సూచనలందిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ, అధికారులు

భీమడోలు: రబీ సీజన్‌లో 2.10లక్షల ఎకరాల్లో వరి నాట్లు పూర్తి అయ్యాయని జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ వై.రామకృష్ణ అన్నారు. భీమడోలు శివారు లింగంపాడు ఆయకట్టు వద్ద 250 ఏకరాల విస్తీర్ణంలోని రైతులు సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని ఎంపిక చేసి జిల్లా స్థాయిలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ వరి క్షేత్రాన్ని ఏలూరు ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్, వ్యవసాయాధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. పొలంబడి కార్యక్రమం నిర్వహణ తీరును పరిశీలించి రైతులకు పలు సూచనలందించారు. కాండం తొలుచు తెగులు, ఎండాకు తెగుళ్ల ఉన్నట్లు గుర్తించి జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ వాటిని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ మాట్లాడుతూ రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 2.62లక్షల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, అపరాలు, పొగాకు సాగు అవుతుండగా, ఇప్పటి వరకు జిల్లాలో 2.10లక్షల ఎకరాల్లో వరి నాట్లు ప్రక్రియ పూర్తి అయ్యాయన్నారు. అయితే వరి సాగుకు అవసరమైన 1.60 మెట్రిక్ టన్నుల ఎరువులను ఆర్‌బీకేలు, సొసైటీల్లో సిద్ధంగా ఉంచామన్నారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలు, ఏలూరు ఏడీఏలు డాక్టర్ పి.ఉషారాజకుమారి, కేవీ సుబ్బారావు, ఎంపీపీ కనుమాల రామయ్య, ఏవో ఎస్‌పీవీ ఉషారాణి, జగన్ సేవాదళ్ నియోజకవర్గ కన్వీనర్ తుమ్మగుంట రంగ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.